సాక్షి
సంగారెడ్డి
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



నగదు రహిత లావాదేవీలు
ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాల్లో నగదు రహిత లావాదేవీలకోసం పైలట్ ప్రాజెక్టుగా వర్గల్ మండలం ఎంపికైంది. వివరాలు 8లో ▸



లోక్‌అదాలత్ సద్వినియోగం..
ఈ నెల 13న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. వివరాలు 8లో ▸



ఎట్టకేలకు మోక్షం
దశాబ్దకాలంగా మూతపడిన కోహీర్‌బస్టాండ్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. వివరాలు 9లో ▸

మొక్కుబడిగా ప్రణాళిక

మున్సిపాలిటీల్లో ఘనంగా ప్రారంభించిన వందరోజుల ప్రణాళిక అంతగా ఫలితాలనివ్వలేదు. అమలులో నిర్లక్ష్యం, నిధుల లేమి, పాలనాధికారుల బదిలీలు వంటి అంశాలు ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రణాళిక అమలులో భాగంగా అన్ని మున్సిపాలిటీల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఒకటి రెండు బల్దియాలు ఇందుకు మినహాయింపుగా నిలిచాయి. అన్ని మున్సిపాలిటీలలో వందరోజుల ప్రణాళిక ఏమేరకు సత్ఫలితాలనిచ్చిందోనని 'సాక్షి' బృందం చేసిన పరిశీలనలో అనేక అంశాలు వెల్లడయ్యాయి.



కొత్త బస్టాండ్‌లోకి వెళ్తున్న మురికి నీరు

పనులు నామమాత్రంగా

సంగారెడ్డి: సంగారెడ్డిలో పారిశుద్ధ్యం పడకేసింది. వందరోజుల ప్రణాళిక పేరుతో చేపట్టిన చర్యలు ఫలితాలనివ్వలేదు. వివిధ విభాగాల మధ్య సమన్వయం లోపంతో ఎక్కడ ఏ పని చేపట్టి పూర్తి చేశారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలోపం కారణంగా పనులు నామమాత్రంగానే పూర్తయ్యాయి. ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. శిథిలావస్థకు చేరిన 11 భవనాలను కూల్చివేశారు. అయితే మున్సిపాలిటీలో మొత్తంగా 80 వరకు శిథిలావస్థకు చేరిన పాతభవనాలను గుర్తించారు. అయితే రాజకీయ ఒత్తిళ్లతోనే వీటి జోలికి పోలేదన్న విమర్శలున్నాయి.

స్వచ్ఛ సంగారెడ్డికి ప్రయత్నిస్తా



స్వచ్ఛత విషయంలో సంగారెడ్డి మున్సిపాలిటీని నంబర్‌వన్‌గా తయారు చేసేందుకు కృషి చేస్తా. ప్రణాళిక పనులపై సమగ్ర విచారణ చేశాకే బిల్లులు చేస్తాం.

– శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్

నెరవేరని లక్ష్యం



జోగిపేట వాసవీనగర్‌లోని చెత్త వద్ద సంచరిస్తున్న పందులు

జోగిపేట(అందోల్): మున్సిపాలిటీల్లో చేపట్టిన వంద రోజుల ప్రణాళిక మొక్కుబడిగానే సాగింది. మున్సిపాలిటీలో 20 వార్డులున్నాయి. పట్టణంలోని చాలా ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. ఈ కార్యక్రమం చేపడుతున్న సమయంలోనే కమిషనర్‌గా పనిచేస్తున్న తిరుపతి బదిలీ అయి వేరొక కమిషనర్ నియామకం, బాధ్యతల స్వీకరణ వంటి వాటితో వందరోజుల ప్రణాళిక అమలులో కొంత జాప్యం జరిగింది. దీంతో పట్టణంలోని ఓపెన్ ప్లాట్లల్లో విపరీతంగా పిచ్చి మొక్కలు పెరిగి పాములు ఇళ్ల మధ్యనే సంచరించి భయాందోళనలకు గురి చేస్తున్నాయి. అంతేకాకుండా పట్టణంలోనే ఇద్దరు పాము కాటుతో మరణించిన ఘటనలున్నాయి.

మున్సిపాలిటీలో పనులు చేపట్టాం

వంద రోజుల ప్రణాళికలో భాగంగా వార్డుల్లో ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో అవగాహన కల్పించాం. 38,328 మొక్కలను నాటాం. దోమల నివారణకు ఫాగింగ్ చేశాం. వీధి దీపాలు ఏర్పాటు చేశాం. ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు సంబంధించి రూ.5.73 కోట్ల రుణాలకు సంబంధించి లింకేజీ చేశాం. కళాశాలలో చేపట్టిన కార్యక్రమంలో మంత్రి దామోదర పాల్గొన్నారు.

రవీందర్, కమిషనర్, జోగిపేట మున్సిపాలిటీ

కొంతవరకే పనులు పూర్తి



ఖేడ్ బస్టాండ్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తా చెదారం

నారాయణఖేడ్: వందరోజుల ప్రణాళికలో భాగంగా ఖేడ్ మున్సిపాలిటీలో చేపట్టిన కొన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పనులు ముమ్మరంగా చేసినా మరికొన్ని ప్రాంతాల్లో సమస్యలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. బస్టాండ్ ఆవరణలో చెత్తా చెదారంతో ముక్కుపుటాలు అదిరిపోతున్నాయి. ప్రధాన రహదారి వెంట పూర్తిగా తొలగించిన చెత్తకుప్పలు తిరిగి పునరావృతమవుతున్నాయి. ప్రధాన రహదారితోపాటు పలు ప్రాంతాల్లో బహిరంగ మల విసర్జన వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో శిథిలావస్థలో ప్రమాదకరంగా మారి కూలేందుకు సిద్ధంగా ఉన్న 6 ఇళ్లను కూల్చివేశారు. నీటి క్లోరినేషన్, రహదారులపై గోతులు పూడ్చివేత పనులు పూర్తిచేశారు.

పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాం

పారిశుద్ధ్య సమస్యను చాలావరకు నివారించాం. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం చేశాం. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాం. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించాం.

– జగ్జీవన్, మున్సిపల్ కమిషనర్



రోడ్డుపై డ్రైనేజీ నీరు

వంద రోజులతో ఒరిగిందేమీలేదు

పటాన్‌చెరు: వంద రోజుల ప్రణాళికతో అమీన్‌పూర్ మున్సిపాలిటీలో పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఆ కార్యక్రమానికి ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయించలేదు. కొన్ని రోజులుగా ప్రత్యేకాధికారి అమీన్‌పూర్‌కు రాకపోవడం, ఆమె నిర్లక్ష్యం కారణంగా సాధారణ నిధులు కూడా విడుదల కాలేదు. అదనపు కలెక్టర్ అమీన్‌పూర్‌కు ప్రత్యేకాధికారిగా నియమితులైన తర్వాతే సింఫనీ వెళ్లే చౌరస్తా, మండే మార్కెట్ చౌరస్తా వద్ద కూడళ్ల అభివృద్ధికి నిధులు విడుదల చేశారు. 1,273 ఇళ్లకు అసెస్‌మెంట్‌లు నిర్వహించి రూ.కోటి 23 లక్షల వసూలు చేశారు. వరద సాఫీగా వెళ్లేందుకు డ్రైనేజ్‌లను శుభ్రం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రోడ్లపై మురుగునీరు పొంగిపొర్లింది.

ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించాం



ప్రజల్లో ప్లాస్టిక్ వినియోగంపై పూర్తి అవగాహన కల్పించాం. ఇళ్ల వద్ద తడి పొడి చెత్త సేకరిస్తున్నాం. స్వయం సహాయక సంఘాలకు రూ.కోట్ల నిధులు మంజూరయ్యాయి.

– జ్యోతి రెడ్డి, కమిషనర్

పారిశుద్ధ్యం పనులు అరకొర

జహీరాబాద్: జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో వంద రోజుల ప్రణాళిక పనులు సుమారు 90% మేర పూర్తయ్యాయి. 13 వేల నల్లా కనెక్షన్లను ఆన్‌లైన్‌లో చేయాల్సి ఉండగా 11వేల వరకు పూర్తి చేశారు. ఆరు వ్యాటర్ ట్యాంకులను క్లీన్ చేశారు. 80% మేర శానిటేషన్ పనులు పూర్తి చేశారు. కాలువల్లో పేరుకు పోయిన మురికి, చెత్తను క్లీన్ చేయడం వంటి పనులు పూర్తయ్యాయి. అక్కడక్కడా కాలువలను పూర్తి చేసే పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ట్రేడ్ లైసెన్సులను 60% మేర అందజేశారు. స్వయం సహాయక సంఘాలకు స్టాళ్లను కేటాయించారు. రోడ్లపై ఏర్పడిన గోతులను పూడ్చివేసే పనులు పూర్తి చేశారు.

లక్ష్యం మేరకు పనులు పూర్తి

వంద రోజుల ప్రణాళికలో ఇచ్చిన పనులను లక్ష్యం మేరకు పూర్తి చేశాం. పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేసేలా కృషి చేయడంతో లక్ష్యాన్ని అందుకున్నాం. ఇదే స్ఫూర్తితో సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తాం.

– సుభాష్‌రావు, మున్సిపల్ కమిషనర్, జహీరాబాద్



రోడ్డు గుంతలను మొరం మట్టితో పూడ్చుతున్న సిబ్బంది

నిధుల కేటాయింపులేవీ?

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపాలిటీలో చేపట్టిన వంద రోజుల ప్రణాళిక నామమాత్రంగానే జరిగింది. నిధులు కేటాయించకపోవడంతో రోజువారీ పనులనే ప్రణాళికలో చేర్చి పూర్తి చేశారు. పారిశుద్ధ్య పనులు, 8,800 మొక్కలు నాటించడం, 51వేల మొక్కల పంపిణీ, 202 కుక్కలకు శస్త్రచికిత్సలు, 303 వ్యాక్సినేషన్, స్ట్రీట్ వెండర్ ఫుడ్ స్టాల్స్ ప్రదర్శన, 50ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.కోటి 35లక్షల రుణాల చెక్కుల పంపిణీ, నూతన గ్రూపుల ఏర్పాటు, నాలాల్లో పూడికతీత పనులు చేపట్టారు. గుంతల పూడ్చివేత, పాతభవనాల కూల్చివేత వంటి పనులు పూర్తి చేశారు. ట్యాంకుల క్లీనింగ్, దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. నల్లా కనెక్షన్లు, ట్రేడ్ లైసెన్స్‌లు మంజూరు పనులు పూర్తి చేశారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా రోడ్ల పక్కనే పడేశారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయం ముందు మురుగునీటి కాలువలో పేరుకుపోయి అపరిశుభ్రతకు నిలయంగా మారింది.



నాగేశ్వర్‌నగర్ కాలనీ రోడ్డుపై చెత్త



చెత్తతో పేరుకుపోయిన మురుగునీటి కాలువ

రోజువారీ పనులే చేపట్టాం

15 రోజుల కిందటే కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టాను. రోజువారీ పారిశుద్ధ్య పనులకే ప్రాధాన్యతనిచ్చాం. ప్రతీ రోజు నిర్వహించే శానిటేషన్, ప్లాస్టిక్ వ్యర్థాల గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

– శివాజీ, మున్సిపల్ కమిషనర్

న్యూస్‌రీల్

ఉత్తమ ప్రతిభ కనబరచాలి

జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్

సంగారెడ్డి జోన్: విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది, అధికారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ మాట్లాడుతూ..వర్టికల్ నియమాలను పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరచాలని చెప్పారు. వర్టికల్ విభాగంలో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు అందిస్తామని వెల్లడించారు.

ఇన్‌చార్జి ఆర్డీఓగా పాండు బాధ్యతల స్వీకరణ



పాండుకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

సంగారెడ్డి : సంగారెడ్డి ఇన్చార్జి ఆర్డీఓగా ఆర్.పాండు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జోగిపేట ఆందోల్ డివిజన్ ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయనకు సంగారెడ్డి ఇన్‌చార్జిగా కలెక్టర్ ప్రావీణ్య బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఇక్కడ ఆర్డీవోగా ఉండి పని చేసిన రవీందర్‌రెడ్డిపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయనను ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండానే రెవెన్యూ శాఖకు రిపోర్ట్ చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. నూతనంగా బాధ్యతలు తీసుకున్న పాండును రెవెన్యూ డివిజన్ శాఖ సిబ్బంది ఆయనకు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యాలయ ఏవో తన్‌మొళి, సంగారెడ్డి తహసీల్దార్ జయరాం నాయక్, సిబ్బంది తదితరులున్నారు.

మొదటికొచ్చిన ధరణి కష్టాలు!

పరిష్కార ప్రక్రియ తిరిగి తహసీల్దార్ నుంచి ప్రారంభం

- సీసీఎల్‌ఏ స్థాయికి వెళ్లిన ఫైళ్లన్నీ వెనక్కి..?
- కొనసాగుతున్న భూసమస్యల కష్టాలు



కలెక్టరేట్‌లో భూభారతి సహాయ కేంద్రం వద్ద ఉన్న ఈ మహిళా రైతు పేరు ఎర్కొల్ల సత్తమ్మ. ఈమెది ఝరాసంఘం మండలం ఎల్గోయి గ్రామం. ఈమెకు 2 ఎకరాల 13 గుంటల భూమి ఉంది. ధరణి పోర్టల్‌లో 23 గుంటలకు మాత్రమే పట్టాదారు పాసు పుస్తకం రాగా, మిగిలిన ఎకరం 30 గుంటల భూమికి సంబంధించిన పాసుపుస్తకం కోసం 2022 నుంచి అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతోంది. ఈ మిస్సింగ్ సర్వే నంబర్ కేటగిరీకి చెందిన దరఖాస్తులను పరిష్కరించే అధికారం ధరణి పోర్టల్‌లో సీసీఎల్‌ఏ కార్యాలయానికే ఉండేది. ఈ దరఖాస్తుకు సంబంధించిన స్థానిక తహసీల్దార్, ఆర్డీఓ ఇచ్చిన నివేదికలు.. ఇన్నాళ్లు సీసీఎల్‌ఏ వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పుడు భూభారతి వచ్చాక ఈ మిస్సింగ్ సర్వే నంబర్‌ను సరిచేసే అధికారం కలెక్టర్లకు ఇచ్చారు. దీంతో ఈ ప్రక్రియంతా తిరిగి తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభం కావాల్సి ఉందని, అక్కడి నుంచి మళ్లీ నివేదికలు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : భూసమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూభారతి పోర్టల్‌లో కొన్ని మాడ్యూల్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియ మళ్లి మొదటి కొచ్చింది. ఇప్పటికే ధరణి పోర్టల్ ఉన్న తహసీల్దార్లు ఇచ్చిన నివేదికలతో కూడిన ఫైళ్లు పక్కన బెట్టాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం. కొన్ని కేటగిరీలకు చెందిన దరఖాస్తుల ప్రక్రియను తిరిగి తహసీల్దార్ స్థాయి నుంచి ప్రారంభిస్తున్నామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. దీంతో బాధిత రైతులు కష్టాలు తప్పడం లేదు. మిస్సింగ్ సర్వే నంబర్‌తో పాటు, ఆర్‌ఎస్‌ఆర్ వేరియేషన్స్ వంటి మాడ్యుల్‌లలోని భూసమస్యలను తిరిగి తహసీల్దార్‌స్థాయి నుంచి ప్రక్రియప్రారంభిస్తున్నారు.

సుమారు 2 వేలకు పైగా ఇలాంటి దరఖాస్తులే..

ధరణి పోర్టల్ స్థానంలో కొత్తగా తెచ్చిన భూభారతి అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రైతుల నుంచి తిరిగి దరఖాస్తులు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 604 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో మొత్తం 13,897 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో తిరిగి తహసీల్దార్ నుంచి ప్రక్రియ ప్రారంభం కావాల్సిన కేటగిరీల దరఖాస్తులు సుమారు రెండు వేలకు మించి ఉంటాయని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

రైతులకు అవే తిప్పలు

భూభారతి వచ్చినా రైతులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. తమ భూసమస్యల పరిష్కారం కోసం వారు చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఈ భూసమస్యల పరిష్కారం కోసం వచ్చిన రైతులే అధికంగా ఉంటున్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్ వంటి సుదూర ప్రాంతాల నుంచి సైతం రైతులు కలెక్టరేట్‌కు వస్తున్నారు. తీరా ఇక్కడి వచ్చాక వారికి ఫైల్ తహసీల్దార్ల వద్ద ఉందని అధికారులు చెప్పి పంపుతున్నారు. భూభారతి సహాయ కేంద్రానికి వెళ్లి తమ దరఖాస్తు పరిష్కారం ఎంత వరకు వచ్చిందని ఆరా తీసి నిరాశగా ఇంటికి వెళుతున్నారు.

పరిషత్ ఓటర్లు 7,44,157

పోలింగ్ స్టేషన్లు 1,458

తుది జాబితా ప్రకటించిన అధికారులు



సంగారెడ్డి జోన్: జిల్లాలో ప్రాదేశిక పరిషత్ ఎన్నికలకు 7,44,157 మంది ఓటర్లు ఉండగా 1,458 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. త్వరలో నిర్వహించే పరిషత్ ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు, వాటి స్థితిగతులతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. బుధవారం తుది ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్లు జాబితాను విడుదల చేశారు. 635 ప్రాంతాలలో 1458 పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 25 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 261 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలను నిర్వహించారు. కొత్తగా మండలాల ఏర్పాటుతో పాటు పాత మండలాలు మున్సిపాలిటీలుగా మారటంతో పరిషత్ స్థానాల సంఖ్య తగ్గింది. 2019 సంవత్సరంలో నిర్వహించిన పరిషత్ ఎన్నికలలో 25 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 295 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. గతంలో కంటే ప్రస్తుతం స్థానాల సంఖ్య తగ్గింది.

పోరాట యోధురాలు ఐలమ్మ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సాయుధ పోరాటాన్ని రగిలించిన అగ్నికణం ఐలమ్మని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు అభివర్ణించారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ.. నాటి తెలంగాణ సాయుధ పోరాటాన్ని, చరిత్రను నేడు మతోన్మాద శక్తులు వక్రీకరిస్తున్నాయన్నారు. హిందూ, ఐలమ్మ ధీరత్వాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఈ నెల 17న సంగారెడ్డిలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి పాల్గొన్నారు.

నూతన భవనం కోసం స్థల పరిశీలన

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్
- కూలిన హాస్టల్ పైకప్పు శిథిలాల తొలగింపు
- పనులు పర్యవేక్షిస్తున్న తహసీల్దార్



భవనం కూలిన ప్రదేశంలో వివరాలు తెలుసుకుంటున్న చంద్రశేఖర్

మునిపల్లి(అందోల్): లింగంపల్లి గురుకుల పాఠశాల, హాస్టల్ నూతన భవనం కోసం స్థల పరిశీలన చేస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని లింగంపల్లిలో మంగళవారం కూలిపోయిన గురుకుల పాఠశాల, హాస్టల్ భవనాన్ని ఆయన పరిశీలించారు. కూలిన శిథిలాల తొలగింపు పనులను తహసీల్దార్ గంగాభవానీ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ...కూల్చివేత, శిథిలాల తొలగింపు పనులు ఎంత త్వరగా పూర్తయితే అంతే వేగంగా హాస్టల్‌కు నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభిచే అవకాశముందన్నారు. అయితే కూలిన స్థలంలోనా లేక కొత్త స్థలంలో నిర్మించడమా అనే దానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా వారిని మరో భవనంలోకి తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్‌కుమార్, మైనార్టీ సీనియర్ నాయకులు మక్సూద్ పటేల్, ప్రిన్సిపాల్ చైతన్య, తహసీల్దార్ గంగాభవాని, పంచాయతీ ఈఈ మనీష్, ఇన్‌చార్జి శ్రీనాథ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తప్పని యూరియా తిప్పలు



యూరియా కోసం క్యూలో నిరీక్షిస్తున్న రైతులు

- హత్నూర, దౌల్తాబాద్‌లో యూరియా కోసం రైతుల క్యూ
- రోజుల తరబడి నిరీక్షణ

హత్నూర(సంగారెడ్డి): యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. పనులు మానుకుని రోజుల తరబడి పడిగాపులు కాసినా యూరియా దొరకడం కష్టంగానే ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన హత్నూర సొసైటీ కార్యాలయం, దౌల్తాబాద్‌లోని ఎరువుల దుకాణాల వద్ద యూరియా కోసం ఉదయం నుంచి ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఆధార్ కార్డులు పెట్టి ఎదురు చూశారు. బుధవారం సుమారు 90 మెట్రిక్ టన్నుల యూరియా (2000 బస్తాలు) రావడంతో ఒక్కసారిగా దుకాణాల ముందు ఎగబడ్డారు. ఆధార్ కార్డుకు ఒక రైతుకు రెండు బస్తాల యూరియా మాత్రమే పంపిణీ చేశారు. పోలీసులు రైతులకు నచ్చజెప్పి వరుసలో నిలబెట్టారు. అయినా కొంతమందికి సరిపడా యూరియా దొరకలేదు. వరి పత్తి సాగు చేసి నెలలు గడిచిపోయిన యూరియా అవసరమున్నంత మేర దొరకకపోవడంతో పంటలు ఎదగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హత్నూర మండలం రైతులకు అవసరం ఉన్న యూరియాను సరఫరా చేయాలని వేడుకున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావును సంప్రదించగా ఇప్పటికీ సుమారు 1,700 మెట్రిక్ టన్నుల యూరియా మండలానికి వచ్చిందని మరో రెండు రోజుల్లో హత్నూర సొసైటీ సిరిపురం ఎరువుల దుకాణానికి రానుందని తెలిపారు. ఇంకా సుమారు 300 మెట్రిక్ టన్నుల యూరియా మండలానికి అవసరం ఉందని ప్రతిపాదనలు నివేదించామని వివరించారు.

క్లుప్తంగా

పంటల సస్యరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థినులు

తొగుట(దుబ్బాక): విద్యార్థులు క్షేత్రస్థాయిలో పొలంబాట పట్టారు. మండలంలోని గుడికందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి తోర్నాల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థినులు వ్యవసాయ పరిశోధనలో భాగంగా పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి, మొక్కజొన్న, చిరుధాన్యాల పంటలకు రసాయనాలు వాడకుండా పెరమోన్, ట్రాప్ జిగురు అట్టల వాడకంపై పాఠశాల విద్యార్థులకు వివరించారు. అలాగే కృత్రిమ ఎరువుల వాడకం వివిధ రసాయనాలను చల్లడం వల్ల కలిగే నష్టాల గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అంజిరెడ్డి, ఉపాధ్యాయులు భిక్షపతి, శివయ్య పాల్గొన్నారు.

అగ్రిసెట్‌లో పేట విద్యార్థినికి ప్రథమ ర్యాంకు



ప్రజ్ఞశ్రీ

పెద్దశంకరంపేట(మెదక్): ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం నిర్వహించిన 2025–26 అగ్రిసెట్ ప్రవేశ పరీక్షలో మెదక్ జిల్లా పెద్దశంకరంపేటకి చెందిన బుచ్చగోని ప్రజ్ఞశ్రీ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. బీఎస్సీ అగ్రికల్చర్ ఎంట్రెన్స్ ఫలితాలు మంగళవారం విడుదలవ్వగా.. ప్రియాంక కాలనీకి చెందిన శంకర్‌గౌడ్, మంగమ్మ చిన్న కుమార్తె ప్రజ్ఞశ్రీ ర్యాంకు సాధించింది. అంతకుముందు అగ్రికల్చర్ డిప్లొమా పూర్తి చేసిన ఆమె జిల్లా టాపర్‌గా నిలిచింది. హైదరాబాద్‌లోని బండ్లగూడ నిర్వహణ ఉచిత కోచింగ్ సెంటర్‌లో గత ఆరు నెలలుగా కోచింగ్ తీసుకుంటూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. దీంతో ఆమెను తల్లిదండ్రులు, కాలనీవాసులు అభినందించారు.

పత్తి పంటలో గంజాయి సాగు



గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): గుట్టు చప్పుడు కాకుండా పత్తి పంటలో అంతర పంటగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హద్నూర్ ఎస్‌ఐ దోమ సుజిత వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చాల్కికి చెందిన గౌని గుండప్ప పత్తి పంటలో గంజాయిని అంతర పంటగా సాగు చేస్తున్నాడు. సమాచారం మేరకు హద్నూర్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 17 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకోగా.. వీటి విలువ సుమారు 1.70లక్షలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. అనంతరం నిందితుడు గుండప్పను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

కార్మికుడికి ఎమ్మెల్యే ఆపన్నహస్తం



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. పటాన్‌చెరు డివిజన్‌లోని సాయిబాబా సెల్యులోజ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికుడికి ఆపన్నహస్తం అందించారు. గత శనివారం పరిశ్రమలో ప్రమాదవశాత్తు అమర్ సింగ్ అనే కార్మికుడు (59) యంత్రంలో పడి కుడి చేయి కోల్పోయాడు. ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులతో పాటు కార్మికులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని ఆశ్రయించారు. పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి రూ. 25 లక్షల పరిహారం ఇప్పించారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆర్థిక సహాయాన్ని అందించారు.

గులాంగిరి.. కాదంటే గురి!



మితిమీరుతున్న జిల్లా బాస్‌ల ఆగడాలు

- పారిశ్రామికవాడలో ఒత్తిడికి గురవుతున్న రెవెన్యూ అధికారులు
- ఇతర శాఖల్లోనూ ఇదే తంతు

పటాన్‌చెరు: జిల్లా అధికారులకు పటాన్‌చెరు పారిశ్రామికవాడ బంగారు బాతుగుడ్డుగా మారింది. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న మండల స్థాయి అధికారులందరూ జిల్లా బాస్‌లకు గులాంగిరి చేస్తేనే ఇక్కడ కొనసాగే పరిస్థితి నెలకొంది. లేకపోతే మారుమూల ప్రాంతాలకు బదిలీ కావాల్సిందే. ఇది ఒక్క రెవెన్యూలోనే కాకుండా పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్ లాంటి ప్రధాన శాఖల్లో ఇదే తంతు నడుస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్డీఓ బదిలీ అంశం పారిశ్రామికవాడ అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయన ఇక్కడ అధికారులపై చేసిన ఒత్తిడిపై చర్చ జరుగుతుంది. సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణల్లో ప్రధానంగా ఆయన జిల్లా ఉన్నతాధికారులకు మధ్యవర్తిగా కూడా పని చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రామచంద్రాపురం మండలంలో ఓ అసైన్డ్ భూమికి ఎన్‌ఓసీ జారీ చేసే ప్రక్రియలో గతంలో ఇక్కడ పని చేసిన జిల్లా ఉన్నతాధికారిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో జిల్లా ఉన్నతాధికారిపై వచ్చిన అవినీతి ఆరోపణలతో వార్తలు రావడంతో మీడియాను మచ్చిక చేసుకునేందుకు ఆ ఆర్డీఓ జిల్లా ఉన్నతాధికారికి, మీడియాకు మధ్యవర్తిగా వ్యవహరించారు. సంగారెడ్డి ఆర్డీఓపై వచ్చిన అవినీతి ఆరోపణలతో ఆయనను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆయనను గతంలో ఇక్కడ నుంచి బదిలీ చేస్తే పీసీసీ స్థాయి నేత ఒకరు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సంగారెడ్డి ఆర్డీఓగా తిరిగి పోస్టింగ్ ఇప్పించుకున్నారు. రెవెన్యూ శాఖ రాష్ట్ర మంత్రిత్వ శాఖ వరకు ఆ ఆర్డీఓ అవినీతి కార్యకలాపాలపై ఫిర్యాదులు అందడంతోనే బదిలీ వేటు పడిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఒత్తిడికి గురవుతున్న అధికారులు

మండల స్థాయి అధికారులు జిల్లా బాస్‌ల నుంచి అనేక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తమ అనుకూలమైన సిబ్బందిని మాత్రమే ఈ ప్రాంతంలో కొనసాగనిస్తారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అసైన్డ్, వక్ఫ్, ప్రభుత్వ, చెరువు భూములను చెరబట్టేందుకు రియల్టర్లు వేసే ఎత్తుగడలకు జిల్లా స్థాయి అధికారులే లొంగిపోతున్నారని వారి ఆదేశాలతోనే చేసేదేమీ లేక మండల స్థాయిలో అధికారులు వారికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న వారు జిల్లా బాస్‌లకు గులాంగిరి చేస్తేనే ఇక్కడ కొనసాగే పరిస్థితి నెలకొంది.

నగదు రహిత లావాదేవీలు

మహిళా సంఘాల్లో అమలు

- పైలెట్ ప్రాజెక్టుగా వర్గల్ మండలం ఎంపిక
- ఊరూరా మహిళా సంఘాలకు శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య

వర్గల్(గజ్వేల్): సమయం ఆదా, పారదర్శకత, జవాబుదారి ధ్యేయంగా మహిళా స్వయం సహాయక సంఘాల నగదు రహిత లావాదేవీల కోసం పైలెట్ ప్రాజెక్టుగా జిల్లా నుంచి వర్గల్ మండలం ఎంపికైంది. బుధవారం వర్గల్ సెర్ప్ కార్యాలయంలో నగదు రహిత లావాదేవీలు, డిజిటల్ చెల్లింపులు, యూపీఐ పేమెంట్లు తదితర అంశాలపై అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులకు, గ్రామ సంఘ సహాయకులకు కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య, సెర్ప్ ప్రధాన కార్యాలయ బ్యాంకు లింకేజీ ప్రాజెక్టు మేనేజర్ నర్సింహస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య మాట్లాడుతూ మహిళా సంఘాల్లో డిజిటల్ పేమెంట్స్ కోసం పైలెట్ ప్రాజెక్టుగా వర్గల్ మండలం ఎంపిక కావడం అభినందనీయమన్నారు. స్వయం సహాయక సంఘ మహిళలు ఇందుకు అనుగుణంగా తర్ఫీదుపొంది, నగదు లావాదేవీలతో మండలాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ నర్సింహస్వామి, డీపీఎం ప్రకాష్, ఏపీఎం కిరణ్ కుమార్, గజ్వేల్ ఏరియా సీబీఓ ఆడిటర్ బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో వర్గల్ పూలే గురుకుల విద్యార్థులు

సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

వర్గల్(గజ్వేల్): స్థానిక పూలే గురుకుల బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ సాధనకు ఉపయుక్తంగా నిలిచే అంశాలపై నంది ఫౌండేషన్ నిర్వహించిన వారం రోజుల శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. శిబిరంలో 100 మంది విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ ఫేసింగ్ మెలకువలు, రెస్యూమే ప్రిపరేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు ఎలా సాధించాలో ట్రైనర్లు వోమిజి, శ్యామ్ వివిధ యాక్టివిటీల ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఉపయోగపడే మాన్యువల్ పుస్తకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్ రావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాధ పాల్గొన్నారు.

షాబుద్దీన్ దర్గాకు చాదర్ సమర్పణ



దర్గాకు చాదర్‌ను సమర్పించేందుకు వెళుతున్న హరీశ్‌రావు

జహీరాబాద్: సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు హజ్రత్ షేక్ షాబుద్దీన్ దర్గాకు చాదర్‌ను సమర్పించారు. మంగళవారం రాత్రి హరీశ్‌రావు మండలంలోని శేఖాపూర్‌లో జరుగుతున్న ఉర్సు ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తలపై చాదర్ పెట్టుకుని దర్గాకు సమర్పించారు. అనంతరం దర్గాను దర్శించారు. ఖవ్వాలీ కార్యక్రమాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు ఖిజర్ యాఫై, తట్టు నారాయణ, సంజీవరెడ్డి, వెంకటేశం, మొహియొద్దీన్, యాకూబ్, నామ రవికిరణ్, విజేందర్‌రెడ్డి, చిన్నారెడ్డి, ఉర్సు కమిటీ సభ్యులు కిజర్, చస్మొద్దీన్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువతి మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువతి మృతిచెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. బొల్లారం వైపు నుంచి ముత్తంగి రింగ్ రోడ్డు ఎగ్జిట్ సమీపంలో గుర్తుతెలియని యువతి (25)ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి

ములుగు(గజ్వేల్): వికలాంగులు, చేయూత పింఛన్‌దారులకు ఎన్నికలకు ముందూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేశ్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన వికలాంగుల హక్కుల పోరాట సమితి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. హామీల అమలు విషయంలో ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈ నెల 15న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

డ్యూటీకి వెళుతుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- ప్రైవేట్ ఉద్యోగి మృతి

పటాన్‌చెరు టౌన్: బైక్‌పై డ్యూటీకి వెళ్తున్న ఓ వ్యక్తిని డీసీఎం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటాన్ చెరు మండలం నందిగామకు చెందిన సాయికృష్ణ (27) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం తన బైక్‌పై నందిగామ నుంచి క్యాసారం గ్రామ మార్గంలో డ్యూటీకి వెళ్తుండగా మార్గ మధ్యలో డీసీఎం బైకును ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ శివారులో బుధవారం జరిగింది. స్థానికుల వివరాలు.. గ్రామానికి చెందిన ఆకుల బాలయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సిద్దిపేట వైపు నుంచి గ్రామానికి వస్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం వాహనం ట్రాక్టర్ వెనక భాగంలో ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

‘ఇందిరమ్మ’ పనుల్లో వేగం పెంచండి

- లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించండి
- ఏఈలకు హౌసింగ్ పీడీ మాణిక్యం ఆదేశం



ఏఈలతో మాట్లాడుతున్న పీడీ మాణిక్యం

మెదక్ కలెక్టరేట్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని, లబ్ధిదారుల దగ్గరుండి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం ఏఈలకు సూచించారు. బుధవారం జిల్లా హౌసింగ్ కార్యాలయంలో ఏఈలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా నిర్మాణాలు ప్రారంభించని ఇందిరమ్మ లబ్ధిదారులు వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వారం వారం బిల్లులు అందజేస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు తెలిపాలన్నారు. నిర్మాణాలు త్వరితగతిన చేపట్టేందుకు లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎప్పటికప్పుడు నిర్మాణాలను ఫొటో క్యాప్చర్ చేసి హౌసింగ్ యాప్‌లో పొందు పర్చాలన్నారు. తద్వారా లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు అందుతాయన్నారు. ఏమైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 18005995991కు సంప్రదించాలని కోరారు. అన్ని మండలాల ఏఈలు పాల్గొన్నారు.

రైతులు సమన్వయం పాటించాలి

డీఏఓ స్వరూప రాణి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఏఓ స్వరూప రాణి

మిరుదొడ్డి(దుబ్బాక): రైతులకు సరిపడా యూరియా అందజేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అన్నదాతలు కాస్త ఓపికతో సమన్వయం పాటించాలని డీఏఓ స్వరూప రాణి కోరారు. బుధవారం మిరుదొడ్డిలోని రైతు వేదికను ఆమె సందర్శించారు. యూరియా టోకెన్ల పంపిణీలో జరిగిన రైతుల ఆందోళన, ఫర్నీచర్ ధ్వంసంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా సరఫరా చేస్తున్నప్పటికీ కొంత మంది కావాలని ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలని చూడటం సరికాదన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుండి వచ్చే సమాచారాన్ని అందించేందుకు ఉపయోగపడే రైతు వేదికలపై దాడికి పాల్పడటం విచారకరమన్నారు. ఇబ్బందులు కలగకుండా యూరియా సరఫరా చేయడానికి వ్యవసాయ అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక ఏడీఏ మల్లయ్య, మండల వ్యవసాయ అధికారి మల్లేశం, ఏఈఓలు అఖిల్, రేఖ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

నిజాంపేట(మెదక్): ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన నిజాంపేట మండలం కల్వకుంటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బత్తుల రేణుక (44) వ్యవసాయ కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. బత్తుల చంద్రం, రేణుక దంపతుల కూతురు పెళ్లి, కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చే మార్గంలేక మనస్తాపం చెంది బుధవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగింది. వెంటనే చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రేణుక మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని తిగుల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా స్థాయిలో అండర్ –17 ఖోఖో పోటీల్లో మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రాష్ట్ర స్థాయి టీఎల్‌ఎంకు నందిని ఎంపిక



నందిని ఉపాధ్యాయురాలు

శివ్వంపేట(నర్సాపూర్): సమగ్ర శిక్షా రాష్ట్ర స్థాయి టీఎల్‌ఎం మేళాకు శివ్వంపేట ఉపాధ్యాయురాలు ఎంపికైంది. బుధవారం మెదక్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళాలో శివ్వంపేట శివాలయనగర్ పీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు మెతుకు నందిని పాల్గొంది. మేళాలో ఈవీఎస్ సబ్జెక్ట్ నుంచి విద్యార్థులకు సులభంగా బోధన అర్థమయ్యేలా ప్రదర్శించినందుకు గాను రాష్ట్ర స్థాయిలో నిర్వహించే మేళాకు ఎంపికైనట్లు ఎంఈఓ బుచ్చనాయక్ తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపిక పట్ల పాఠశాల హెచ్ఎం శేఖర్, మండల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

కాపర్ కేటుగాళ్లు

- ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి వైర్ చోరీ
- దుండగులకు పట్టుకోవాలని రైతుల విజ్ఞప్తి



కాఫర్ వైర్‌ను చోరీ చేసిన దొంగలు

మద్దూరు(హుస్నాబాద్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాఫర్ వైర్ చోరీ అయిన సంఘటన మద్దూరు మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వారాల శ్రీను వ్యవసాయ బావి వద్ద గల 16కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాఫర్ వైర్‌ను దొంగిలించినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులు నిఘా పెట్టి దొంగలను పట్టుకోవాలని రైతులు వాపోతున్నారు.

నిందితుడికి 20 ఏళ్ల జైలు

బాలికపై అత్యాచారం కేసులో న్యాయమూర్తి తీర్పు

జిన్నారం (పటాన్‌చెరు): ఓ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి ఇరవై కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి కె జయంతి బుధవారం తీర్పునిచ్చారు. బొల్లారం సీఐ రవీందర్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. బొల్లారం లక్ష్మీ నగర్ కాలనీలో భూస్వామి కృష్ణారావు ఇంట్లో నివాసం ఉంటున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఫిర్యాదుదారు కూతురు (6). 2019లో కృష్ణారావు కొడుకు దుర్గాప్రసాద్(20) భవనంపై తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. కేసు పూర్వాపరాలు విచారించిన కోర్టు పై శిక్ష విధించింది. నిందితుడికి శిక్ష పడేలా చేసిన స్పెషల్ పీపీ సుర్ రెడ్డి, ఎస్హెచ్ ఓ లక్ష్మారెడ్డి, ఇన్వెస్టిగేషన్ అధికారి రిటైర్డ్ డీఎస్పీ రాజేశ్వరరావు, ప్రస్తుత ఎస్హెచ్ఓ ఎం రవీందర్ రెడ్డి, పోలీస్ స్టేషన్ కోర్టు డ్యూటీ ఆఫీసర్ అశోక్, జిల్లా లైజనింగ్ అధికారి సత్యనారాయణ, ఎస్ఐలను ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

లోక్‌అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లావ్యాప్తంగా 19,858 పెండింగ్‌లో కేసులు
- జిల్లా వ్యాప్తంగా 12 బెంచీలు
- అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న న్యాయవాదులు, పోలీసులు



లోక్ అదాలత్ కోసం సమావేశం నిర్వహించిన అధికారులు

సంగారెడ్డి టౌన్ : జిల్లాలోని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ‘రాజీయే రాజమార్గం’అనే నినాదంతో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థలు లోక్‌అదాలత్ నిర్వహించి కేసులు పరిష్కరిస్తున్నాయి. రాజీయే రాజమార్గమని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్జీలు సూచిస్తున్నారు.

పెండింగ్ కేసులు ఎక్కువగానే...

జిల్లా వ్యాప్తంగా 19,858కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ లోక్ అదాలత్‌లో విద్యుత్, టెలిఫోన్ రికవరీ, సివిల్, కుటుంబ, ఆస్తి తగాదాలు, రోడ్డు ప్రమాణాలు, మోటార్ వెహికల్ కేసులు, బ్యాంకుల రికవరీ కేసులు వస్తాయి.

జిల్లా వ్యాప్తంగా 12 బెంచీలు

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయడానికి జిల్లావ్యాప్తంగా 12బెంచీలను ఏర్పాటు చేస్తున్నట్లు న్యాయవాదులు తెలిపారు. సంగారెడ్డిలో ఏడు, జహీరాబాద్‌లో మూడు, నారాయణఖేడ్, జోగిపేటలో ఒక్కొక్కటి చొప్పున బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

సరిదిద్దుకోవచ్చు



అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోవద్దు. జిల్లా వ్యాప్తంగా నమోదైన, పెండింగ్‌లో ఉన్న, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో కక్షిదారులు రాజీపడేలా జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి. రాజీ పడదగిన కేసులలో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి, వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ పడేలా చూడాలి.

– పరితోశ్ పంకజ్, జిల్లా ఎస్పీ

విజయవంతం చేయాలి



జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్ అధి కారులు కలసి జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి. కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. రాజీమార్గంతో ఎక్కువ కేసులను పరిష్కరించుకోవడానికి సహకరించాలి.

– భవానీ చంద్ర, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

311 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం లారీని పట్టుకున్న చిరాగ్‌పల్లి పోలీసులు

జహీరాబాద్: వికారాబాద్ జిల్లా శంకర్‌పల్లి ప్రాంతం నుంచి సేకరించిన రేషన్ బియ్యం గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తుండగా బుధవారం చిరాగ్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామ శివారులో గల ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద 65వ జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తున్న క్రమంలో అక్రమ బియ్యం లారీ పట్టుబడింది. అందులో 311 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యం విలువ రూ.9,95,840 మేర ఉన్నట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా గుజరాత్‌కు చెందిన డ్రైవర్ రమేష్ కజారీయాను అదుపులోకి తీసుకున్నారు. చెవ్వ భాస్కర్‌తో కలిసి రమేష్‌లు శంకర్‌పల్లి ప్రాంతంలో రేషన్ వినియోగదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసుకుని అధిక ధరలకు అమ్మేందుకు గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్నారు. దాడుల్లో పౌరసరఫరాల శాఖ అధికారి బస్వరాజ్, పోలీసులు పాల్గొన్నారు.